క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



రామారెడ్డి: ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పే స్కేల్ అమలు చేయాలని చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డికి పశుమిత్రలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తక్కువ జీతంతో కొన్నేళ్లుగా పని చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పశుమిత్రలు రవళిక, హారిక, చంద్రకళ, రజిత పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో నిఘా

నిజాంసాగర్: కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సహరిద్దు ప్రాంతమైన జుక్కల్ మండలం సోపూర్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును మంగళవారం జుక్కల్ ఎస్సై మురళీతో కలిసి డీఎస్పీ జగన్నాథరెడ్డి తనిఖీ చేశారు. డబ్బు, మద్యం సరఫరా, అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు.

సింగిల్ విండోలకు తేమ కొలిచే యంత్రాలు

భిక్కనూరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని సింగిల్ విండోలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఎల్రక్టానిక్ తూకం యంత్రాలు, టార్పాలిన్లు, తేమను కొలిచే యంత్రాలు తదితర వాటిని మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టెడి భగవంతరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి థామస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఫుడ్ లైసెన్స్ తప్పనిసరి

కామారెడ్డి టౌన్: హోటల్, ఇతర తినుబండారాల తయారీదారులు ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత తెలిపారు. మంగళవారం కామారెడ్డిలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా విక్రయాలు చేపడితే రూ. 5 లక్షల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష విధిస్తామన్నారు. జిల్లాలో 14 కేసులు నమోదు చేశామన్నారు. వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిరీష ఉన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

మద్నూర్: మహిళల ఆరోగ్యంపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శిరీష సూచించారు. డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం సందర్భంగా ఆమె ఆస్పత్రిని సందర్శించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగితెలుసుకుందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోరాటం కొనసాగిస్తాం



సాక్షి, నెట్‌వర్క్: ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి ఐదో రోజుకు చేరింది. కొన్నిచోట్ల కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు, పలువురు కార్మికులు, కార్పొరేటర్లు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన చేస్తామని వారు పేర్కొన్నారు.

వేములవాడకు బస్సు..

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి నుంచి వేములవాడ వెళ్లే బస్సును స్థానికులు మంగళవారం స్వాగతం పలికారు. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేములవాడ నుంచి బీబీపేట, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, కంచర్ల, పెద్దమల్లారెడ్డి, మల్లుపల్లి మీదుగా రామాయంపేటకు, తిరుగు ప్రయాణంలో ఇదే రూటులో వేములవాడకు వెళ్తుంది. సోమవారం పెద్దమల్లారెడ్డికి వచ్చిన ఆర్టీసీ బస్సుకు స్వాగతం పలికి ఆర్టీసీ సిబ్బందిని గ్రామస్తులు సన్మానించారు. ఎంపీటీసీ సాయగౌడ్, సర్పంచ్ లక్ష్మి రాజలింగం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూమి కబ్జాపై ఫిర్యాదు

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామ సర్వే నంబర్ 113లో సొసైటీ వద్ద రైతుల కోసం భూమిని దరువు చేసి మెరం పోసిన భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేశారని వైస్ ఎంపీపీ బాపురెడ్డితో పాటు పలువురు రైతులు మంగళవారం తహసీల్దార్ కౌశిక్ రెడ్డి, కామారెడ్డి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

10న ప్రవేశ పరీక్ష

భిక్కనూరు: మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతుల్లో ప్రవేశాలకు 10న పరీక్ష నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మల్లయ్యబట్టు తెలిపారు. హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా సూచించారు. జిల్లా కేంద్రంలోని 11 పరీక్ష కేంద్రాల్లో 2,536 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు కన్వీనర్ వెల్లడించారు.

అకాల వర్షాలతో అపార నష్టం

- నష్ట పరిహారం ఇస్తామని రైతులకు భరోసా
- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



కొమలంచలో వడగండ్లకు దెబ్బతిన్న పంటలు పరిశీలిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే

నిజాంసాగర్: అకాల వర్షాలతో పంటలకు అపార నష్టం వాటిల్లిందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. పంట నష్టానికి గురైన రైతు కుటుంబాలకు సీఎం కేసీఆర్ కొండంత అండగా నిలుస్తారన్నారు. పంట నష్టపోయిన రైతులు మనోధైర్యాన్ని కోల్పోవద్దని, ప్రభుత్వ పరంగా పంటనష్ట పరిహారం అందిస్తామని భరోసా కల్పించారు. మంగళవారం మండలంలోని కొమలంచ గ్రామ శివారులో వర్షాలు, వడగండ్ల వల్ల నష్ట పోయిన పొలాలు, కొనుగోలు కేంద్రంలో తడిసి మొలకలు వచ్చిన ధాన్యం కుప్పలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతును రాజు చేయడం లక్ష్యంగా సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. పంట సాగుకు అవసరమైన పెట్టుబడి సహాయాన్ని రైతు బంధు ద్వారా చెల్లిస్తున్నారన్నారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను సర్వే నంబర్ల వారీగా ప్రభుత్వానికి వెంటనే నివేదిక ఇవ్వాలని వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ నారాయణ, వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్, ఎస్సై నాగోని రాజు, సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, సర్పంచులు లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, చెందర్‌రాథోడ్, ఉప సర్పంచ్ సంతోష్, బీఆర్ఎస్ నాయకులు లింగాల రాంచెందర్, అబ్దుల్, శ్రీనివాస్ ఉన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

- బీఆర్ఎస్‌ను ఆదరిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి
- కావాలనే ఎమ్మెల్సీ కవితపై కేసులు
- రాజకీయ లబ్ధి కోసం బీజేపీ, కాంగ్రెస్‌ల ఆరాటం
- ఎమ్మెల్యే జాజాల సురేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

సదాశివనగర్: తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను ఆదరిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితపై అనవసరంగా కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధి కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నాయన్నారు. వాటిని ఏవి నమ్మకుండా రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని కోరారు. గత పాలకులు పింఛన్ల కోసం ఏడాదికి రూ. 340 కోట్లు ఖర్చు చేస్తే సీఎం కేసీఆర్ ప్రస్తుతం రూ. 900 కోట్లు వెచ్చిస్తున్నారన్నారు. రూ. 2 కోట్లతో సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామాల్లో డబుల్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నర్సింలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు భూంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, ఎంపీటీసీ వీరయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సాయిలు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



గాంధారిలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే సురేందర్

గాంధారి: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సూచించారు. మంగళవారం ఆయన గాంధారి రైతు వేదిక భవనంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరుతో ఆడపిల్లల పెళ్లిళ్లు చేసిన తల్లిదండ్రులకు ప్రభుత్వం లక్ష రూపాయలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధాబలరామ్ నాయక్, తహసీల్దార్ గోవర్ధన్, సర్పంచ్ సంజీవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వజీర్ శివాజీరావు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండల కేంద్రమైన తాడ్వాయిలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే జాజాల సురేందర్ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నిరుపేదల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుబంధు, రైతు బీమా పథకాలు ఎంతో ఉపయోగా పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కౌడి రవి, జెడ్పీటీసీ రమాదేవి, వైస్ ఎంపీపీ నర్సింలు, సర్పంచ్ సంజీవులు, డీసీసీ ఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీవో రాజవీర్, నాయకులు మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జెడ్పీటీసీ అరిగెల శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, జొన్న శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్, శేక్ కరీం, సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ కవిత, నవీన్ పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిర్మల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, ఉప సర్పంచ్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను బహిష్కరించాలి



ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

ఎల్లారెడ్డి: అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను సీఎం కేసీఆర్ పార్టీ నుంచి బహిష్కరించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాగయ్య డిమాండ్ చేశారు. అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎల్లారెడ్డిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితబంధు పథకంలో ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ. 3 లక్షల వరకు కొందరు ఎమ్మెల్యేలు తీసుకున్నారని సీఎం కేసీఆర్ ప్రకటించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పద్మారావు, బాలరాజు, దాశయ్య, మానయ్య, పర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. రైతన్నను వీడని భయం

- ధాన్యం, జొన్నలకు మొలకలు
- నష్టం అంచనా కోసం క్షేత్రస్థాయికి అధికారులు



ఇబ్రిపూర్‌లో పొలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



నాగిరెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల మధ్య నుంచి పారుతున్న వర్షపు నీరు

సాక్షి, నెట్‌వర్క్: రైతులను అకాల వర్షాల భయం వీడలేదు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ధాన్యం, జొన్నలు నీట మునగడంతో మొలకలు వచ్చాయి. వాటిని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందోలేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉండగా పంట నష్టం అంచనా వేసేందుకు తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. నాగిరెడ్డిపేట మండలంలో పోచారం, నాగిరెడ్డిపేట, మాల్తుమ్మెద, బంజర, మెల్లకుంటతండా, బొల్లారం, ఎర్రకుంటతండా, ఆత్మకూర్‌లలో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి తదితర గ్రామాలలో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి మొలకలు వచ్చాయి. నిజాంసాగర్ మండలంలో ధాన్యంతో పాటు కొన్న కుప్పలు తడిసి మొలకలు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడ్వాయి మండలం క్రిష్ణాజివాడిలో వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి శ్రీకాంత్ పరిశీలించారు. కామారెడ్డి మండలం ఇస్రోజివాడి, గర్గుల్, లింగాపూర్, ఇబ్రిపూర్, అడ్లూర్ గ్రామాల్లో తహసీల్దార్ వెంకటరావు, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావుతో కలిసి పంట పొలాలు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. సదాశివనగర్ మండలం వజ్జపల్లి, అమర్లబండ, ధర్మారావ్‌పేట్‌లో పంటలు దెబ్బతిన్నాయి. వర్షానికి తడవకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు కవర్లు కప్పేందుకు టార్పాలిన్ కిరాయి ఎక్కువగా ఉన్నందున ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీబీపేటకు చెందిన రైతు ఎంబరి రామన్న అన్నారు. ఈ పరిస్థితి చక్కదిద్దడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దోమకొండ మండలం అంచనూరు, సంఘమేశ్వర్, గొట్టిముక్కుల, దోమకొండలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి తదితరులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి



పెద్దమల్లారెడ్డిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్‌అలీ



కలెక్టర్ కార్యాలయానికి నాయకులతో కలిసి వచ్చిన పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి

భిక్కనూరు: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండలంలోని పెద్దమల్లారెడ్డిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ పంట నష్టపోయిన పొలాలను పరిశీలించకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, నేతలు బాగారెడ్డి, ఎల్లంరెడ్డి, స్వామి, తిరుమల్‌స్వామి బాబు పాల్గొన్నారు.

కామారెడ్డి క్రైం: తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులకు నష్ట పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



దోమకొండలో కొనుగోలును ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి



కామారెడ్డి మండలం శాబ్దిపూర్‌లో..



ఎల్లారెడ్డి మండలం కళ్యాణిలో..

దోమకొండ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం ఆయన దోమకొండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, బు రాని సమత, సింగిల్‌విండో చైర్మన్ వన్నాల నాగరాజ్‌రెడ్డి, తహసీల్దార్ కౌశిక్, సొసైటీ సీఈవో బాల్‌రెడ్డి ఉన్నారు.

సదాశివనగర్: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గైని అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు సూచించారు. సదాశివనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దన్వాల్, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, విండో చైర్మన్ కమలాకర్ రావు, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట: మండల కేంద్రమైన రాజంపేటలో సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్ ఎంపీపీ లింగాల స్వరూపతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు.

లింగంపేట: మండలంలోని మాలోత్ తండా పంచాయతీ పరిధిలో కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సునీత ప్రారంభించారు. తూకం వేసిన వారం రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.

ఎల్లారెడ్డి రూరల్: మండలంలోని కళ్యాణి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ రఘువీర్ గౌడ్‌తో కలిసి సొసైటీ చైర్మన్ నర్సింలు ప్రారంభించారు.

కామారెడ్డి రూరల్: మండలంలోని శాబ్దిపూర్ గ్రామంలో సర్పంచ్ వస్తం యాదవ్వ, సింగిల్ విండో డైరెక్టర్ మాలోత్ సంతోష్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

పిట్లం: మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామంలో సహకార సంఘం చైర్మన్ నారాయణరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

రాజంపేట: మండల కేంద్రమైన రాజంపేటలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాజంపేట సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్, ఎంపీపీ లింగాల స్వరూప, మండల రైతు కో ఆర్డినేటర్ మోహన్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు.

స్పీకర్‌ను కలిసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు



శ్రీనివాస్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.

బాన్సువాడ: కాంట్రాక్ట్ అధ్యాపకులను సీఎం కేసీఆర్ రెగ్యులర్ చేయడం సంతోషకరమని అధ్యాపకులు విజయకుమార్, లక్ష్మణ్ తదితరులు మంగళవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఆధ్యాత్మికం

■ 108 రకాల స్వీట్లతో కాలభైరవుడి అలంకరణ



రామారెడ్డి: ఇస్సన్నపల్లి శ్రీకాలభైరవుడిని మంగళవారం 108 రకాల స్వీట్లతో అలంకరించారు. దేవుడి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీనివాస్ శర్మ, వంశీకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, నాగరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కనిగిరి కమలాకర్ రెడ్డి, ఈవో ప్రభాకర్, చంద్రం పాల్గొన్నారు.

■ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నాగిరెడ్డిపేట: మండలంలోని గోలిలింగాల మండల శివారున నిర్మించిన శివాలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆవాహిత దేవతాపూజ, మహాన్యాసము, ధాన్యాధివాస తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

■ ఘనంగా ధ్వజారోహణం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

■ గంగమ్మ ఆలయం వద్ద హోమం

నిజాంసాగర్: మండలంలోని సర్వ గ్రామ పాత చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయం వద్ద హోమం నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రహదాత బిక్షపతి, గంగపుత్ర సంఘం నాయకులు పెద్ద విఠల్, అంజయ్య, బాలయ్య, చిన్న అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తరుగు నాలుగు కిలోలా?

- జాతీయ రహదారిపై బైఠాయించిన రైతుల ఆందోళన

నాగిరెడ్డిపేట: ధాన్యం నాణ్యత లేదనే కారణంతో 40 కిలోల బస్తాకు నాలుగు కిలోల తరుగును ఇవ్వాలని రైస్‌మిల్ యజమాని డిమాండ్ చేయడంతో రైతులు నాగిరెడ్డిపేటలో మంగళవారం రైతులు జాతీయ రహదారిపై బైఠాయించి గంటన్నరపాటు ఆందోళన చేశారు. మాల్తుమ్మెద సొసైటీ పరిధిలోని నాగిరెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో 40 కిలోల బస్తాకు 2 కిలోల తరుగుతో ధాన్యాన్ని తూకం చేసి వాటిని సంబంధించిన లారీని భిక్కనూర్‌లోని విజయగణపతి రైస్‌మిల్‌కు పంపగా ధాన్యం నాసిరకంగా తరుగు 4 కిలోలు ఇస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని రైస్‌మిల్ యజమాని చెప్పారని రైతులు ఆరోపించారు. సొసైటీ చైర్మన్ కోళ్ళం చేసుకొని రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో భిక్కనూర్‌లోని రైస్‌మిల్లులో నిలిచిపోయిన లారీని వెంటనే ఖాళీ చేయించారు. దీంతో రైతులు శాంతించి వారి ఆందోళనను విరమించారు. ఏపీఎం రాజలింగ్ మాట్లాడుతూ సొసైటీ తరఫున ప్రతి రైతుకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపేట మాజీ జెడ్పీటీసీ జయరాజ్, రైతులు మన్నె లచ్చయ్య, సాయికుమార్, మల్లేశం, విట్టల్, నర్సింహారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని తిమ్మారెడ్డిలో విద్యుదాఘాతంతో కొక్కంద గ్రామం బీరయ్యకు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం చేయాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా నియామకం

మాచారెడ్డి: కాంగ్రెస్ ఎస్టీ విభాగం మండల శాఖ అధ్యక్షుడిగా కాకుల గుట్ట తండాకు చెందిన బుక్యా శంకర్ నాయక్ ను నియమించారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలగం

రామారెడ్డి: కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం, బలగమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పరుశురాం అన్నారు. కన్నాపూర్ తండాలో కార్యకర్తలకు బీమా కార్డులు అందజేశారు.

ఇళ్ల స్థలాల కోసం నిరాహార దీక్ష

కామారెడ్డి టౌన్: ఇళ్ల స్థలాలు తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ముందు నిరాహార దీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

సదాశివనగర్: సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏలు డిమాండ్ చేశారు. వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించాలని వారు కోరారు.

నిరసన దీక్షకు మద్దతు

భిక్కనూరు: మండలంలోని ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా కాచాపూర్ గ్రామంలో చేపట్టిన నిరసన దీక్షకు సంగమేశ్వర్, అయ్యవారిపల్లి, పెద్దమల్లారెడ్డి, మోందాపూర్ గ్రామాలకు చెందిన రజక సంఘం ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.

అనుమతుల్లేని స్కూళ్లను సీజ్ చేయాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీఎం జిల్లా అధ్యక్షుడు బుల్లెట్, ఉపాధ్యక్షులు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

ఎల్లారెడ్డి: అకాల వర్షాలతో పంట నష్ట పోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని వెల్లుట్ల, వెల్లుట్లపేట గ్రామాలలో వడగండ్ల వర్షంతో నష్ట పోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నర్సింలు, సాయిలు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

కామారెడ్డి టౌన్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ మంగళవారం కలెక్టర్ కార్యాలయ ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మోతీరాం నాయక్, చంద్రశేఖర్, అరుణ్, రాజారామ్ పాల్గొన్నారు.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

బాన్సువాడ: పట్టణంలోని కోన బాన్సువాడ ఉన్నత పాఠశాలలో కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సురేందర్ మాట్లాడుతూ హెల్త్ క్యాంప్‌లో 50 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తామని తెలిపారు.